క్లుప్తంగా

దైవచింతనతో మానసిక ప్రశాంతత



చింతపల్లి : తక్కెళ్లపల్లిలో పూజలు చేస్తున్న రవీంద్రకుమార్

చింతపల్లి : మండలం పరిధిలోని తక్కెళ్లపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఈదమ్మ, మడేలయ్య, శీతాలమ్మ దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో పాగాకు శ్రీశైలం, జగదీశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

డిండి : విద్యుదాఘాతంతో రెడు గేదెలు మృతిచెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన నూకం పార్వతమ్మ, రమణమ్మలకు సంబంధించిన రెండు గేదెలు వ్యవసాయ పొలంలో గడ్డి మేస్తున్న సమయంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యాదాఘాతానికి గురికావడంతో రెండు గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. గేదెల విలువ దాదాపుగా రూ.60వేల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడుగులపల్లి : మండల కేంద్రానికి చెందిన కోదూరి వాణి, కునుకుంట్ల మౌనికలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో వాణిశ్రీకి రూ.20వేలు, మౌనికకు రూ.52500ల చెక్కులను నాయకులు మాద్గుల గురువయ్య, కొదూరు వెంకటయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల వెంకన్న, నరేశ్, జానయ్య, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ బలి కార్యక్రమం

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసురమర్ధిని అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదమ్మ బలి కార్యక్రమాన్ని ఆచారమంతులు, వతనదారులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సైదులు

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే తైక్వాండో నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు అన్నారు. నల్లగొండ పట్టణంలోని సన్‌లైన్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో జిల్లా జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగళ్ల రమేష్, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, ఈద భాస్కర్, రాజు, జడ ప్రశాంత్, పూర్ణచందర్, కరుణాకర్, శివరాం, మనోజ్ పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న జ్ఞానానందగిరి

నల్లగొండ టూటౌన్: నాగర్ కర్నూల్‌లోని జ్ఞాన తపోవన ఆశ్రమం నిర్వాహకుడు జ్ఞానానంద గిరి స్వామి ఆదివారం నల్లగొండ పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో యోగా సాధకులకు క్రియా యోగంపై ఉచిత శిక్షణ ఇచ్చారు. నిష్కమకర్మ యోగాలోని క్రియా యోగం, మానసిక, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగ సాధకులు పాల్గొన్నారు.

వన నర్సరీలపై పర్యవేక్షణ కరవు

- మొలకెత్తని మొక్కలు
- ఖాళీగా దర్శనమిస్తున్న మట్టి నింపిన కవర్లు
- నిర్దేశిత లక్ష్యం నెరవేరేనా

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 2025–2026 గాను కొండమల్లేపల్లి మండల అధికారులు మండల పరిధిలో లక్ష పదహారు వేల మొక్కలు ఖాళీ ప్రదేశాల్లో నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన వన నర్సరీ కేంద్రాల ద్వారా మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో వన నర్సరీ కేంద్రానికి జనాభా ప్రాతిపదికన సుమారు 5వేల నుంచి 25వేల మొక్కల వరకు పెంచుతున్నారు. కాని చాలా నర్సరీల్లో నాటిన విత్తనాలు మొలకెత్తకుండా మట్టిని నింపి ఉంచిన కవర్లు కనిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం నాసిరకం విత్తనాలు నాటడమేనని మొలకలు రాలేదని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ముఖ్యంగా కొండమల్లేపల్లి, పెండ్లిపాకల, చెన్నారం, దోనియాల, సీసీ తండా, గుమ్మడవెల్లి, జానిగానితండ, వంటి గ్రామ పంచాయతీల్లో వన నర్సరీ కేంద్రాల్లో మొలకెత్తని కవర్లు దర్శనమిస్తున్నాయి. ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ఈ వన నర్సరీ కేంద్రానికి మొక్కలు పెంచడానికి సుమారుగా రూ.ఒక లక్ష పైచిలుకు వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఇంత డబ్బు ఖర్చు చేస్తున్నప్పటికీ నర్సరీల్లో మొక్కలు మొలకెత్తక ఖాళీ కవర్లు దర్శనమివ్వడం గమనార్హం.



కొండమల్లేపల్లి నర్సరీలో మట్టినింపిన కవర్లలో మొలకెత్తని మొక్కలు



దోనియాల నర్సరీలో..

పర్యవేక్షణ కరువు

అధికారులు మాత్రం వన మహోత్సవ కార్యక్రమం నాటికి వంద శాతం మొక్కలు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు. కాని ప్రస్తుతం నర్సరీల్లో 60 నుంచి 65 శాతం మొక్కలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ వన మహోత్సవ కార్యక్రమాన్ని జూన్, జూలై మాసంలో ప్రారంభిస్తారు. ఇదిలా ఉంటే నర్సరీలపై అధికారుల క్షేత్ర పర్యవేక్షణ లేకపోవడం పంచాయతీ కార్యదర్శులు సరైన దృష్టిని కేంద్రీకరించకపోవడం, కొన్ని గ్రామపంచాయతీలు ఇన్‌చార్జ్‌ల పాలనలో ఉండడం వంటి కారణాల వల్ల నర్సరీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. దీని వల్ల ప్రభుత్వ ధనం కూడా వృథా అవుతుందని చెప్పొచ్చు. ఇప్పటికైన పై అధికారులు క్షేత్ర పరిశీలన చేసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వన మహోత్సవం నాటికి ప్రతి గ్రామపంచాయతీల్లో వంద శాతం మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అయితే అధికారులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుతారా లేదా అని వేచి చూడాలి.

నాసిరకం విత్తనాలే కారణం

కొండమల్లేపల్లి మండలంలో వన మహోత్సవం ప్రారంభమయ్యే నాటికి ఒక లక్ష పదహారు వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. దానికి అనుగుణంగానే నర్సరీ కేంద్రాల్లో మొక్కల పెంపకం కార్యక్రమం కొనసాగుతుంది. నాసిరకం విత్తనాలు నాటడం వల్ల మొలకెత్తని మట్టి నింపి ఖాళీ కవర్లు ఉన్న మాట వాస్తవమేనని, వాటి స్థానంలో వేగంగా పెరిగే బొప్పాయి, మునగ వంటి నారులు తీసుకొచ్చి వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభమయ్యే నాటికి అనుకున్న లక్ష్యాన్ని చేరే విధంగా ప్రత్యేక చొరవ చూపుతాం.

– బాలరాజురెడ్డి, ఎంపీడీఓ, కొండమల్లేపల్లి

గ్రామ దేవతల అనుగ్రహం పొందాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన బొడ్రాయి(నాభిశిల) తృతీయ వార్షికోత్సవంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గ్రామ దేవతల అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, నాయకులు దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆత్మీయ చింతన కలిగి ఉండాలి

చింతపల్లి : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఆత్మీయ చింతన కలిగి ఉండాలని దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తక్కెళ్లపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గణపతి మడేలయ్య స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో పురాతన దేవాలయాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, పవన్ కుమార్, నరసింహారెడ్డి, హరినాయక్,నరసింహ, భాస్కర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

మృతురాలి కుటుంబానికి మంత్రి పరామర్శ

మాడుగులపల్లి : మండలంలోని పోరెడ్డిగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏ పోరెడ్డి వెంకట్‌రెడ్డి తల్లి రంగమ్మ, ఇటీవల మృతి చెందింది. ఆదివారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోరెడ్డి గ్రామంలో రంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుమర్తి నుంచి కొప్పోలు వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయిస్తానన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ పుల్లేల సైదులు, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, పురుషోత్తం రెడ్డి, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రభుత్వ నిర్వహణలో ఉద్యోగులే కీలకం

నాగార్జునసాగర్ : ప్రభుత్వ నిర్వహణలో ఉద్యోగులే కీలమని, ప్రజలకు ప్రభుత్వానికి వారధులు ఉద్యోగులేనని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సేవా సంఘం (టీఎస్ -మేసా) జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాంద్‌పాషా తెలిపారు. సాగర్‌లోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ జానీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాంద్‌పాషా మాట్లాడారు. ఉద్యోగులతో స్నేహంగా ఉంటామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాలరాయడం సరికాదన్నారు. అనంతరం నాగార్జునసాగర్ మేసా డివిజన్ నూతన కార్యవర్గనాన ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. యూనిట్ అధ్యక్షుడిగా జానీ, అధ్యక్షుడిగా య్యద్ మహబూబ్ జానీ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ గౌస్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ హఫీజ్, అదనపు కార్యదర్శిగా మహ్మద్ హుస్సేన్ ఎన్నికయ్యారు. వీరితో జిల్లా ప్రధాన కార్యదర్శి ముబీన్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయించారు.



జానిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

వైభవంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు



కొండమల్లేపల్లిలో వాహనాల రద్దీ

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో ఆదివారం బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి నాభిశిల, ముత్యాలమ్మ దేవతకు సమర్పించారు. ఆదివారం అందులో బోనాల సందడి నెలకొనడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. దీంతో ఎస్ఐ అజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అసలే ఆదివారం... అందులో సంత, బొడ్రాయి (నాభిశిల) తతీయ వార్షికోత్సవం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో ఎస్ఐ అజ్మీర రమేష్ దగ్గరుండి ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేశారు.

సంజీవని ట్రస్ట్ వ్యవస్థాపకుడు రఫాయెల్ మృతి



రఫాయెల్(ఫైల్)

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 1992లో సంజీవని ట్రస్ట్ పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా విద్య, వైద్యం తదితర సేవలందించిన ఫాదర్ రఫాయెల్(79) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు సోమవారం సంజీవని ట్రస్టులో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఉపాధ్యాయులకు స్ఫూర్తి ప్రదాత యాదగిరి



సామల యాదగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

హాలియా : పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సామల యాదగిరి ఉపాధ్యాయులకు స్ఫూర్తి ప్రదాత అని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. అనుముల, తిరుమలగిరి(సాగర్), పెద్దవూర మండలాల పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా ప్రాంతీయ కార్యాలయంలో సామల యాదగిరి 23వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామల యాదగిరి చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందా సైదులురావు గౌతమ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అనుముల మండల ప్రధాన కార్యదర్శి చెన్ను వెంకట్‌రెడ్డి, తిరుమలగిరి సాగర్ మండల అధ్యక్షుడు పరుశురాం గౌడ్, పెద్దవూర మండల ప్రధాన కార్యదర్శి నారాయణదాసు దుర్గా ప్రసాద్, జిల్లా బాధ్యులు కుంచం హరివర్ధన్, కన్మంతరెడ్డి జైపాల్‌రెడ్డి, నల్లబోతు వెంకన్న యాదవ్ ఉన్నారు.

పవర్‌లూమ్ కార్మికుడికి చేయూత



నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ: పట్టణంలోని పద్మానగర్‌లో నివాసం ఉంటున్న పవర్‌లూమ్ కార్మికుడు మిర్యాల శ్రీనివాస్ కిడ్నీ వ్యాధికి గురై డయాలసిస్ చేయించుకుంటున్నాడు. శ్రీనివాస్ వైద్య ఖర్చుల కోసం ఆయన భార్య మిర్యాల ధనలక్ష్మికి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ ఆదివారం సంఘం తరపున రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, ఉపాధ్యక్షుడు గంజి రామలింగం, దుడుకు లక్ష్మీనారాయణ, గంజి మురళి, పున్న రమేష్, మనం చంద్రశేఖర్ , మూడ వేణు పాల్గొన్నారు.

టీఆర్‌జీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనునాయక్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనునాయక్

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం(టీఆర్‌జీఎస్) ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ధీరావత్ శ్రీనునాయక్‌ను నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపకులు ధీరవత్ రవినాయక్ ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం మిర్యాలగూడలో నియమక పత్రాన్ని శ్రీనునాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ గిరిజన సంఘాన్ని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన సంఘం వ్యవస్థాపకులు ధీరావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్‌నాయక్, ఆంబోతు వెంకన్న నాయక్, జవహర్ నాయక్‌లతో పాటు రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

డిండి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గదారల్ తండాలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశానికి ఆయన హాజరై ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు తూము బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, మండల కార్యవర్గ సభ్యుడు సోమిడి శ్రీనయ్య, గ్రామ కార్యదర్శి మూడవత్ కృష్ణనాయక్, సహాయ కార్యదర్శి మద్దు పుల్లారెడ్డి, తవక్లాపూర్ శాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, నాయకులు వెంకటయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజయ్య నాయక్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తాళ్లగడ్డ రోడ్డులో శ్రీకనకదుర్గ ఫంక్షన్‌హాల్ సమీపంలో మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండటంతో పాటు ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యాలు ఉంటే మరింత రద్దీగా ఉంటుంది. కొంత కాలంగా ఈ రోడ్డులో మ్యాన్‌హోల్ మూత లేకపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు గుర్తించి వెంటనే మూత ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు.



తాళ్లగడ్డ రోడ్డులో కనకదుర్గ ఫంక్షన్‌హాల్ వద్ద మూత లేకుండా ఉన్న మ్యాన్‌హోల్

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగులపల్లి : పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మాడుగులపల్లి మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటగ్‌రెడ్డి, ఇటికాల జాన్‌రెడ్డి, పాల్గొన్నారు.

కుత్బుషాపురంలో మేరీమాత ఉత్సవాలు

గరిడేపల్లి: మండల పరిధిలోని కుత్బుషాపురం గ్రామంలో ఆదివారం మేరీమాత ఆలయ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మేరీమాత ఆలయానికి సంఘం సభ్యుడు ఆకుల అరవింద్ గంటను బహూకరించారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ టూటౌన్ బీజేపీ పూర్తి స్థాయి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ పార్టీ టూ టౌన్ ప్రధాన కార్యదర్శి పెద్దబోయిన వెంకటరమణ ప్రకటించారు. పట్టణ టూ టౌన్ ప్రధాన కార్యదర్శులుగా గుండ్లపల్లి శ్రీకాంత్, బాషపాక శంకర్, ఉపాధ్యక్షుడిగా ఐలా శ్రీను, నందికొండ హరి ప్రసాద్, నిరంజన్‌రెడ్డి, కనపర్తి రాంప్రసాద్, కార్యదర్శులుగా కోర్పుల యాదగిరి, ఎం నాగరాజు, గోలి రేణుక, ధీరావత్ మాణిక్‌లాల్, కోశాధదికారిగా రవికుమార్‌ను నియమిస్తూ వెంకటరమణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అందే విధంగా చూస్తామన్నారు. రానున్న ఎన్నికల వరకు టూ టౌన్ పరిధిలో బీజేపీ తిరుగులు లేని పార్టీగా చేస్తామని తెలిపారు.




బీజేపీ టూ టౌన్ ప్రధాన కార్యదర్శులుగా గుండ్లపల్లి శ్రీకాంత్, భాషపాక శంకర్

జర్నలిస్టుల జాతరను జయప్రదం చేయాలి



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హాలియా : టీజేఎఫ్ 25వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఈనెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించనున్న జర్నలిస్టు జాతరను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే–143 జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం హాలియా పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం సాగర్ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గురుపాదం, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా జిలాకల ప్రధాన కార్యదర్శి జానయ్య, జిల్లా కార్యదర్శి మనాది రవీందర్, లట్టుపల్లి కాశి, సాగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, సైదులు, గురవయ్య, కోటేష్, సైదులు, లింగారెడ్డి, దశరథ, భిక్షం, పాక సుధాకర్, రమావత్ సరేష్, రవీందర్‌రెడ్డి, సైదయ్య, చందునాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిర్యాలగూడ టౌన్ : ఆనాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



గుర్రంపోడు : ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : దామరచర్ల మండలం వాడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2017–18 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం ఆనాటి చదువుచెప్పిన గురువులను జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ఆడెపు శాంతకుమారీ, సరోజ, కర్నాటి రాంరెడ్డి, బైరం శేఖర్, రజబలి, నాగలక్ష్మిల విద్యార్థులు దుర్గారావు, త్రివేణి, దమయంతి, శ్రీనివాస్, దినేష్, నితిన్, నాగసైదులు, నరేష్, స్వప్న, పావని, సమీనా, బడేసాబ్, సాజిదా, కిరణ్, అంజలి, శ్రవణ్, ఉమ, శివ నాగలక్ష్మి, నరేష్, శివరామకృష్ణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాల 2009–10 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ పసుపులేటి మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల స్నేహబంధం బలమైనదని, ప్రతి ఒక్కరూ ఒకరినొకరు అండగా నిలివాలంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వద్దిరెడ్డి నర్సింహ్మారెడ్డి, రావుల వెంకటనారాయణ, పన్నాల గోపాల్, జాల మల్లేషం, పూర్వ విద్యార్థులు వెంకట్‌రెడ్డి, రేపాక కోటేష్, శివరాజ్, జగపతిబాబు, ఘాసిరాం, జానీపాషా, కంచర్ల భవాని, రాజేశ్వరి, దాము కవిత, రాధిక పాల్గొన్నారు.